సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+10 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 195

శనివారం 5-10-2024



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



ఆయిల్‌పాం సాగుతో లాభాలు

ఆయిల్‌పాం సాగుతో లాభాలు వస్తాయని పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి అన్నారు. -4లో



ఎట్టకేలకు అభివృద్ధికి మోక్షం


తాండూరు పట్టణంలో అభివృద్ధి పనులకు మోక్షం లభించింది. -4లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ఖాకీకి ఇసుక మచ్చ

ఇసుక అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారని చర్యలు

- ఒకేసారి ఐదుగురు పోలీసు అధికారులపై వేటు
- ఒకరి సస్పెన్షన్, ఇద్దరు ఐజీ ఆఫీస్‌కు, మరో ఇద్దరు ఎస్పీ ఆఫీస్‌కు అటాచ్
- పోలీసు శాఖలో కలకలం



వికారాబాద్: ఒకే సారి ఐదుగురు పోలీసు అధికారులపై వేటు పడటం జిల్లా పోలీసు శాఖలో కలకలం రేపింది. మల్టీ జోన్ -2 పరిధిలోని తొమ్మిది జిల్లాలో 14 మంది పోలీసు అధికారులపై చర్యలు తీసుకోగా ఇందులో వికారాబాద్ జిల్లాకు చెందిన వారే ఎక్కువ ఉండటం చర్చనీయాంశంగా మారింది. గురువారం ఐజీ సత్యనారాయణ జిల్లాకు చెందిన ఓ సీఐని సస్పెండ్ చేయడం తోపాటు మరో ఇద్దరు సీఐలను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఇంకో ఇద్దరు ఎస్‌ఐలను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం తెలిసిందే. గతంలో హత్య కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ముగ్గురు అధికారులపై ఒకేసారి వేటు వేసిన సందర్భాలు ఉండగా ఇలా ఒకే సారి ఐదుగురిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం గడిచిన దశాబ్ద కాలంలో ఇదే మొదటి సారి. ఇసుక మాఫియాతో చేతులు కలపటమే కాకుండా సివిల్ తగాదాల్లో తల దూరుస్తున్నారనే ఆరోపణలు ఎక్కువయ్యాయి. ప్రస్తుతం వేటుకు గురైన వారే కాకుండా జిల్లాకు చెందిన పలువురు ఎస్‌ఐలు, సీఐలు మొదలుకొని డీఎస్పీల వరకు ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో ఐదుగురిపై చర్యలు తీసుకోవడం జిల్లాలో పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. ఇటీవల చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పలు ఘటనలపై కూడా తీవ్ర ఆరోపణలు వచ్చాయి.

అక్రమాల్లో అందరి పాత్ర

జిల్లాలో ఇసుక లభ్యత తాండూరు డివిజన్‌లో ఎక్కువగా ఉంది. ఇక్కడ విధులు నిర్వహించే ఎస్‌ఐలు మొదలుకొని సీఐలు, డీఎస్పీల వరకు ఇసుక అక్రమ రవాణాకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఈ డివిజన్‌లో ఓ ఎస్‌ఐ అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా అది ఇసుక మాఫియా పనే అనే ఆరోపణలు వచ్చాయి. తాండూరు డివిజన్‌లో ఇద్దరు సీఐలు ఉండగా ఆ ఇద్దరు ఇసుక అక్రమాలకు సహకరించారనే కారణంతో వేటు వేశారు. ఇదే సమయంలో ఇద్దరు ఎస్‌ఐలపై కూడా వేటు పడింది. తాండూరు సబ్ డివిజన్ పరిధిలో నాలుగు రూరల్ పోలీస్ స్టేషన్లు, ఒక పట్టణ పోలీస్ స్టేషన్ ఉండగా ఇందులో ఇద్దరు ఎస్‌ఐలు, ఇద్దరు సీఐలపై ఒకేసారి చర్యలు తీసుకున్నారు. ఒకే పోలీసు సబ్ డివిజన్‌లో కేవలం ఇసుక అక్రమాల విషయంలోనే నలుగురిపై వేటు పడటం పలు విమర్శలకు తావిస్తోంది. ఇసుకాసురులకు కొమ్ముకాస్తున్నారనే కారణంతో ఆ డివిజన్ పరిధిలోని నలుగురిపై వేటు పడిందంటే అక్కడ విధులు నిర్వహించే దాదాపు అందరూ అందులో పాత్రధారులేనని స్పష్టమవుతోంది.

పొలిటికల్ సపోర్టుతోనే...

తాండూరు సబ్‌డివిజన్‌లో పోస్టింగుల కోసం జిల్లాలో ఎక్కడా లేనంతగా డిమాండ్ ఉంది. పోలీసు అధికారులు సైతం అక్కడ విధులు నిర్వహించేందుకు పెద్ద మొత్తంలో ముట్టజెప్పి వస్తున్నట్లు సమాచారం. రాజకీయ అండదండలతో పోస్టింగులు తెచ్చుకుంటున్న అధికారులు వచ్చాక కూడా వారు అండగా ఉంటారని రెచ్చి పోతున్నారు. పెద్ద మొత్తంలో నెలవారీ మామూళ్ల వసూలు చేస్తున్నట్లు తరచూ ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇందులో రాజకీయ నేతల హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో అధికారంలో ఉన్న పార్టీకి చెందిన ఓ నాయకుడు ఇసుక అక్రమ రవాణాలో కీలకంగా వ్యవహరించగా ఇప్పుడు అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ఇసుక దందాలో కీలకంగా వ్యవహరిస్తూ పెద్ద మొత్తం ఆర్జిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మామూళ్ల పర్వానికి స్వస్తి పలికి సామాన్యుడికి ఇసుక ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సర్వే బృందాలకు అందుబాటులో ఉండండి



కొంపల్లిలో డిజిటల్ కుటుంబ సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, కలెక్టర్ ప్రతీక్ జైన్

- ప్రజలకు సెర్ప్ సీఈఓ, జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్ సూచన
- కొంపల్లిలో డిజిటల్ కుటుంబ సర్వే పరిశీలన
- పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు అందించే దిశగా అధికారులు పనిచేయాలని సెర్ప్ సీఈఓ, జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్ సూచించారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొంపల్లిలో డిజిటల్ కుటుంబ ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు అందజేయాలని నిర్ణయించిన నేపథ్యంలో సర్వే కోసం గ్రామాలకు వచ్చే అధికారులకు కుటుంబ సమాచారం అందజేయాలని కోరారు. సర్వే బృందాలు వచ్చినప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రస్తుతం ఉమ్మడిగా ఉన్న కుటుంబాలు విడిగా ఉండాలనుకుంటే కుటుంబ యజమానిగా ఉండాల్సిన వారితో వేరుగా డిజిటల్ కార్డు పొందేందుకు సమాచారాన్ని తెలియజేయాలని అన్నారు. కుటుంబ సభ్యులు అందుబాటులో లేకుంటే సమయం ఇచ్చి వివరాలు సేకరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఈడీఎం మహమూద్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి

పరిగి: కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ప్రత్యేక అధికారి దివ్య సూచించారు. శుక్రవారం పట్టణంలోని 13వ వార్డులో సర్వేను కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కుటుంబ వివరాల్లో ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తప్పని సరిగా నమోదు చేయాలని సూచించారు. గడువులోగా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరం అయితే మరో టీంను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని, కుటుంబ యజమానిగా మహిళ మాత్రమే ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసు చంద్ర, తహసీల్దార్ ఆనంద్‌రావు, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేటితో ముగియనున్న సర్టిఫికెట్ల పరిశీలన



వికారాబాద్‌లోని డైట్ కళాశాలలో సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డీఈఓ రేణుకాదేవి

అనంతగిరి: డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నేటితో ముగియనుంది. ఇప్పటి వరకు ఎస్‌జీటీ, ఎస్‌ఏ, పండిట్, వ్యాయమ ఉపాధ్యాయ అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యిందని అధికారులు తెలిపారు. 610 మంది సర్టిఫికెట్లను పరిశీలించడం జరిగిందని, మరో 242 ధ్రువపత్రాలను పరిశీలించాల్సి ఉందని తెలిపారు. శనివారంతో ప్రక్రియ ముగుస్తుందని డీఈఓ రేణుకాదేవి తెలిపారు.

నేడు కందుకూరు చౌరస్తాలో రైతు ధర్నా

హాజరుకానున్న కేటీఆర్, సబితారెడ్డి

కందుకూరు: రైతు రుణమాఫీ చేయడంతో పాటు రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం కందుకూరు చౌరస్తాలో ధర్నా చేపట్టనున్నారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరుకానున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

గడ్డిఅన్నారం పాలకవర్గం ప్రమాణస్వీకారం నేడు



బాటసింగారంలోని మార్కెట్‌లో సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ నూతన పాలకవర్గం శనివారం బాటసింగారంలోని మార్కెట్ ఆవరణలో ప్రమాణస్వీకారం చేయనుంది. మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులు చేయనున్న ప్రమాణస్వీకారోత్సవానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్కతో పాటు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు సభా ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి సీఐ అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన పట్టణంలోని గంజ్‌లో శుక్రవారం వెలుగుచూసింది. ఎస్‌ఐ సుశీల తెలిపిన ప్రకారం.. పట్టణంలోని గంజ్‌లో ఉన్న ఓ రేకుల షెడ్డులో ఓ గుర్తు తెలియని వృద్ధుడు(60) పడి ఉన్నాడు. ఎటువంటి చలనం లేక పోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయాన్ని తెలుసుకున్న ఎస్‌ఐ సుశీల ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. మృతుడి ఆచూకీ తెలియకపోవడంతో శవాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి సంబధీకులు ఎవరైనా ఉంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

గ్రామంలో పోలీసుల తనిఖీ

మర్పల్లి: నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులు పోలీసుల అనుమతి లేకుండా గ్రామాన్ని వదిలి వెళ్లరాదని మోమిన్‌పేట్ సీఐ నవీన్‌కుమార్, మర్పల్లి ఎస్‌ఐ సురేష్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని గుర్రంగట్టు తండాను సందర్శించారు. ఈ సందర్భంగా తండాకు చెందిన పలువురితో మాట్లాడారు. వారు చేస్తున్న దినసరి పనులపై ఆరా తీశారు. నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులు ఊరి విడిచి వెళ్లేటప్పుడు తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

అధిక మోతాదుతో అనర్థం



కుల్కచర్ల: చౌడాపూర్‌లో సాగుకు సిద్ధం చేసిన పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి

కొడంగల్ రూరల్: సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయడం మేలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ధర్మాపూర్‌లో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు అధిక దిగుబడిని ఆశించి రసాయనిక మందులు అధిక మోతాదులో వాడుతున్నారని తెలిపారు. ఇలా చేయడం వల్ల దిగుబడి తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. పంటలు చీడ పీడల బారిన పడినప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించి క్రిమి సంహారక మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ దేవేందర్, రైతులు పాల్గొన్నారు.

పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలి

కుల్కచర్ల: రైతులకు పంటల సాగులో ఎలాంటి సందేహాలు ఉన్నా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం చౌడాపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పంట వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. ఆయిల్‌పామ్ పంట సాగుతో దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. పంట సాగుపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వీరస్వామి, ఏఈఓలు విశ్వనాథ్, వంశీకృష్ణ, భావన తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో క్రీడలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. ఇందులో భాగంగా సీఎం కప్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి క్రీడా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ర్యాలీ జిల్లాలో ఎన్‌టీఆర్ ఎక్స్ రోడ్, ఆలంపల్లి, కొత్తగడి, గేట్ వనంపల్లి ఎక్స్ రోడ్, వెల్చాల్, మోరంగపల్లి, మోమిన్‌పేట్, మేకవనంపల్లి, మీదుగా సంగారెడ్డి జిల్లాలోకి ప్రవేశిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ హనుమంతు రావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులు మధుసూదన్, వెంకటేశ్వర్ రావు, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడా ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

యువకులను ప్రోత్సహించేందుకే..

మోమిన్‌పేట: క్రీడల్లో యువకులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి హనమంతరావు తెలిపారు. శుక్రవారం మోమిన్‌పేట నూతన బస్టాండ్ నుంచి పాత బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరులపై దాడి

చేవెళ్ల: గొర్రెల కాపరులపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. నారాయణపేట జిల్లా బొమ్మనపహాడ్ గ్రామానికి చెందిన గొర్రెల కాపర్లు రోడ్ల వెంట జీవాలను మేపుకుంటూ చేవెళ్ల ప్రాంతానికి చేరుకున్నారు. పామెనవైపు వెళ్తున్న క్రమంలో చేవెళ్ల చెందిన ఎ.ప్రభాకర్‌రెడ్డి, పామెనకు చెందిన సుధాకర్‌రెడ్డి జీవాలను మా పొలాల్లో ఎందుకు మేపుతున్నారంటూ కాపరులపై దాడిచేశారు. కర్రలతో జీవాలను కొడుతున్న క్రమంలో అడ్డుకున్న కాపరి పాండుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆయన చేయి విరగడంతో వెంటనే పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దాడిని ఖండించిన కురుమ సంఘం

గొర్రెల కాపరులపై జరిగిన దాడిని చేవెళ్ల కురుమ సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం సంఘం నాయకులంతా కలిసి బాధితులకు అండగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సేంద్రియ ఉత్పత్తులకు ఆదరణ పెరిగింది

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- జినుగుర్తిలోని ఏకలవ్య ఫౌండేషన్ సందర్శన

తాండూరు రూరల్: ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరిగాక సేంద్రియ ఆహార ఉత్పత్తులకు ఆదరణ పెరిగిందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు మండలం జినుగుర్తి గ్రామ సమీపంలోని ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జినుగుర్తి ఏకలవ్య ఫౌండేషన్ వంద ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయంతో పాటు వ్యవసాయ కళాశాల, గురుకుల పాఠశాల, గోశాల నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా రైతు సంఘాలు ఏర్పాటు చేసి సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ ఇవ్వడం మంచి నిర్ణయమని అన్నారు. సేంద్రియ ఉత్పత్తుల వినియోగంపై ప్రజల్లో ఆసక్తి పెరిగిందన్నారు. అనంతరం సేంద్రియ ఉత్పత్తులు నెయ్యి, సబ్బులు, బెల్లం, పసుపు, బిస్కెట్లు, గో మూత్ర, ముడి బియ్యంను పరిశీలించి కొనుగోలు చేశారు.

గురుకులం సందర్శన

ఏకలవ్య ఫౌండేషన్ ప్రాంగణంలోని సాందీపని గురుకులాన్ని ఎంపీ సందర్శించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడారు. ఈ ఏడాది 4వ తరగతి నుంచి తరగతులు ప్రారంభించినట్లు గురుకుల సిబ్బంది ఎంపీకి తెలిపారు. సీబీ ఎస్‌సీ సబ్జెక్టుతో పాటు నాలుగు వృత్తివిద్యా కో ర్సులు నేర్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పరి రమేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు మల్లేశం, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, కౌన్సిలర్ అంతారం లల త, నాయకులు బంటారం భద్రేశ్వర్, నరేందర్‌రెడ్డి, సందీప్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సేంద్రియ ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్‌ను నమ్మితే భవిష్యత్ అంధకారమే

బషీరాబాద్: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం, పాత ప్రభుత్వం నేతల బూతుల పురాణం చూస్తుంటే అసహ్యం వేస్తోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన పాలకులు అలా మాట్లాడొచ్చా అని నిలదీశారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో ఇళ్లు కూలుస్తూ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయ డ్రామాలకు తెరలేపిందని విమర్శించారు. చివరకు సినిమా వాళ్లను కూడా బూతులు తిడుతున్నారని అన్నారు. శుక్రవారం మండలంలోని కొండా కాశీంపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల మాటల తీరు దారుణంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక్కో రైతుకు ఏటా సబ్సిడీ రూపంలో రూ.65 వేలు అందజేస్తోందని అన్నారు. రాష్ట్రంలో 40లక్షల మంది రైతులకు ఏటా రూ.6 వేల చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన రూ.2 లక్షల రుణ మాఫీ ఎక్కడ పోయిందని నిలదీశారు. రైతు బరోసా ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ భూములపై ప్రత్యేక చట్టం తెస్తుంటే రాహుల గాంధీ మాత్రం దేశాన్ని విడగొట్టేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను నమ్మితే భవిష్యత్ అంధకారం అవుతుందని, ప్రతి పౌరుడు బీజేపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు ఉప్పరి రమేష్, యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, సీనియర్ నాయకులు బంటారం బద్రేశ్వర్, కృష్ణ ముదిరాజ్, రాజ్‌కుమార్ కులకర్ణి, లలితమ్మ, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో కుటుంబానికి రక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పకడ్బందీగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ కార్డు సర్వే ఆదిబట్ల మున్సిపాలిటీలో జరుగుతుండగా శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. ప్రజలకు కార్డుపై అవగాహన కల్పించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఒక గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్డును తీసుకొచ్చిందన్నారు. అధికారులు ప్రతి ఇంటికీ తిరుగుతూ సర్వేను ప్రారంభించారని తెలిపారు. మున్సిపాలిటీలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయో ఈ సర్వే ద్వారా తెలుస్తుందన్నారు. ఈ కార్డు కుటుంబానికి రక్షణగా ఉంటుందన్నారు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ఇంటింటినీ సర్వే చేయాలని, ఎక్కడా ఇబ్బందులు తెలెత్తకుండా పని చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

హామీల అమలులో సర్కారు విఫలం

బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను వంచిస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఇబ్రహీంపట్నంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యకార్యకర్తలతో నిర్వహించిన సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని అన్నారు. రూ.రెండు లక్షల రుణమాఫీపై దేవుళ్లపై ప్రమాణం చేసి సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని మండిపడ్డారు. సగానికిపైగా రైతులు రుణమాఫీ కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారని చెప్పారు. కుంటిసాకులు చెప్పి సంపూర్ణంగా రుణమాఫీ చేయకుంటే రేవంత్ సర్కార్‌పై రైతులే తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. కేసీఆర్ హయాంలో ఏడాదికి రెండుసార్లు రైతుబంధు పంట సాయం అందేదని గుర్తు చేశారు. రైతులకు ఎకరాకు రూ.15 వేలు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి అమలుపరచకపోవడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇచ్చినట్లుగా రైతుబంధు, రుణమాఫీ, రైతు బీమా, అన్ని పంటలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని, పంటల కొనుగోలు సక్రమంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బిట్ల వెంకట్‌రెడ్డి, బీఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా..

- భైక్ ప్రమాదం
- ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

మోమిన్‌పేట: బైక్‌పై బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మోమిన్‌పేట్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ పుండరీకం తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణానికి మహ్మద్ జావిద్(24) స్నేహితుడు మఫాజ్‌లు గురువారం మధ్యాహ్నం బైక్‌పై కోటపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరుగుప్రయాణంలో మొరంగపల్లి సమీపంలో గుంతను గమనించక అందులో పడిపోయారు. జావిద్ తలకు బలమైన గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందగా.. మఫాజ్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు అనీఫ్ ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అంతటా సీఎం సారు కనబడాల్సిందే



సీఎం ఫొటోను గోడకు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బషీరాబాద్: జిల్లా నుంచి మండలం వరకు అన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని పెట్టాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది నెలలకు కార్యాలయాల్లో సీఎం ఫొటో పెట్టాలని ఆదేశాలు రావడంతో యంత్రాంగం ఆ పనిలో నిమగ్నమయ్యారు. జిల్లా, డివిజన్, మండల కార్యాలయాల్లో ఈ నెల 7వరకు సీఎం ఫొటో తప్పక పెట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఫొటో ఫ్రేమ్ సైజులను సైతం సూచించారు. ఇందులో భాగంగా శుక్రవారం బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేశ్ తన కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని గోడకు తగిలించారు.

కల్తీకల్లు తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామంలో కల్తీ కల్లు తయారీ కేంద్రంపై ఎస్‌ఓటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కల్తీకల్లుతో పాటు, ఓ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ శివప్రసాద్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పాలకుర్తి రాఘవేందర్ కల్తీ కల్లు తయారు చేసి విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు గురువారం ఎస్‌ఓటీ, స్థానికపోలీసులు దాడి చేసి నాలుగు డ్రమ్ముల కల్తీ కల్లు బొలేరో వాహనంలో ఉంచినట్లు గుర్తించారు. చెట్టు నుంచి వచ్చే కల్లుకు అమోనియం బై కార్బొనేట్ పౌడర్, సిట్రిక్ యాసిడ్ కలిపి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిసింది. ఈ దాడుల్లో కల్తీ కల్లు తయారీకి వినియోగించే రసాయనాలు, 900 లీటర్ల కల్తీకల్లు, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాఘవేందర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆమనగల్లు మండల ప్రత్యేక అధికారిగా ఆదిలక్ష్మి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆదిలక్ష్మి

ఆమనగల్లు: ఆమనగల్లు మండల ప్రత్యేకాధికారిగా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆదిలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సెప్టెంబర్ వరకు ప్రత్యేకాధికారిగా మహేశ్వరం డివిజన్ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుజాత బదిలీ అవ్వడంతో ఆదిలక్ష్మిని నియమించారు.

డిజిటల్ సర్వే చేయలేం

- క్రాప్ సర్వేలతో ఇబ్బందులు పడుతున్న ఏఈఓలు
- క్షేత్రస్థాయికి వెళ్లి చేయాలంటే తప్పని ఇబ్బందులు
- వీఏఏలను నియమించాలంటూ వేడుకోలు



కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం అందిస్తున్న జిల్లా ఏఈఓలు (ఫైల్)

దోమ: గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వేకు అడ్డంకులు మొదలయ్యాయి. తమ సమస్యలను పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తూ, డిజిటల్ సర్వేలో కూడా ఇబ్బందులు ఉన్నాయని వివరిస్తూ గత నెల 30న జిల్లాలోని ఏఈఓలు కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఇటీవల డిజిటల్ సర్వే కోసం ఏఈఓలకు శిక్షణ అందించిన అధికారులు యాప్‌ను సూచించారు. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు యాప్‌తో సర్వేలు నిర్వహిస్తున్నప్పటికీ ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు ప్రయోజనాలకే..

ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ వ్యవసాయ సామర్థ్యాన్ని పెంపొందించి రైతు ప్రయోజనాల కోసం డిజిటల్ సర్వేను ప్రభుత్వ చేపట్టింది. ఈ సర్వే డిజిటల్ యాప్‌తో రైతు సాగు చేసిన పంట పొలంలోనే సర్వే నంబర్ ఆధారంగా పక్కాగా నమోదు చేయాల్సి ఉంటుంది. సర్వే నంబర్‌కు దూరంగా ఉంటే వివరాలు యాప్‌లో నమోదు కావని అధికారులు చెబుతున్నారు. పంటల కొనుగోలు, ఎగుమతులు, మార్కెటింగ్‌తో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే నష్టాన్ని అంచనా వేయటం తదితర వివరాలు సేకరించడంలో డిజిటల్ క్రాప్ సర్వే సహాయ పడుతుందని అధికారులు చెబుతున్నారు.

ఇబ్బందులు ఇలా..

ప్రభుత్వం నూతనంగా చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వేకు అనేక ఇబ్బందులు ఉన్నాయని ఏఈఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒకరు చొప్పున ఏఈఓను నియమించాలని ఉంది. కానీ ప్రస్తుతం ఒక్కొక్కరికీ ఎనిమిది వేల నుంచి 10 వేల ఎకరాల వరకు బాధ్యతలు అప్పగించారు. ప్రతి సర్వే నంబర్‌కు తప్పనిసరిగా వెళ్లి పంట వివరాలు సేకరించాల్సి ఉందని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. అయితే వర్షాకాలంలో పొలాలకు వెళ్లి వివరాలు సేకరించడం కష్టతరమంటున్నారు ఏఈఓలు. జిల్లాలో చాలా మంది మహిళ ఉద్యోగులు ఏఈఓలు ఉన్నారని, పొలాలకు వెళ్లి సర్వే చేయాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రదేశాల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో సర్వే ఏ విధంగా చేయాలని ప్రశ్నిస్తున్నారు. సర్వే కోసం నూతనంగా ట్యాబ్‌లను అందించి, అదనపు భత్యం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాదిరిగా ప్రతి గ్రామానికి ఒక వ్యవసాయ సహాయకులు(వీఏఏ)లను నియమించాలని ఏఈఓలు వేడుకుంటున్నారు.

సాగు వివరాలు

జిల్లా వ్యాప్తంగా సాగు భూమి	5,35,000 ఎకరాలు
జిల్లాలలో ఉన్న ఏఈఓలు	100

వెళ్లాలంటే నరకమే



ఏఈఓలుగా తమకున్న పూర్తి బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నాం. అధికారులు డిజిటల్ సర్వేను చేయాలని ఇటీవల నూతన యాప్‌ను ఇచ్చారు. దీంతో క్షేత్ర స్థాయిలో వెళ్లి చేయాల్సి వస్తుంది. వర్షాలు కురిస్తే పంట పొలాలు బురదమయంగా మారుతున్నాయి. దీంతో వెళ్లాలంటే నరకం అనుభవిస్తున్నాం.

– కావ్య, ఏఈఓ, పరిగి

తీవ్ర ఇబ్బందులు



కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నూతన యాప్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక క్లస్టర్ పది వేల ఎకరాల సాగు భూమిని సర్వే చేయాలంటే ఇబ్బంది మారుతుంది. తమకు అదనంగా ఇతర రాష్ట్రంలోని నియమించిన వీఏఏల మాదిరిగా ఇక్కడ కూడా నియమిస్తే కొంత భారం తగ్గుతుంది.

– బాబ్యానాయక్, ఏఈఓ, దోమ

ఉన్నతాధికారులకు నివేదించాం



డిజిటల్ సర్వే విషయంలో ఏఈఓలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ తమ దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల ఈ విషయాన్ని కలెక్టర్‌కు దృష్టికి తీసుకువెళ్లారు. ఏఈఓల ఇబ్బందులపై ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో విన్నవించాం. ప్రతిపాదనలు వస్తే సహాయకులను నియమిస్తాం.

– మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

అవినీతి నిర్మూలన అందరి బాధ్యత

- దుకాణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి
- ఎస్పీ నారాయణ రెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణ రెడ్డి

కుల్కచర్ల: అవినీతి నిర్మూలన ప్రతీ ఒక్కరు బాధ్యతగా భావించి.. సమాజంలోని చట్టవ్యతిరేక చర్యలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేయాలని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కుల్కచర్ల పీఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టవ్యతిరేక చర్యలపై పోలీస్‌శాఖ కఠినంగా వ్యవహరిస్తోందని అందుకు ప్రజలు సహకరించి రేషన్ బియ్యం సరఫరా చేస్తున్న వారి వివరాలు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ఇసుక అక్రమరవాణా సైతం సహించమని హెచ్చరించారు. సీసీ కెమెరాలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకుని నేర నియంత్రణకు సహకరించాలన్నారు. దుకాణదారులు తప్పక ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాఠశాలలు, బస్సుల్లో వెళ్తున్న విద్యార్థులకు షీటీం పోలీసులు ప్రత్యేక సమీక్షలు నిర్వహిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు క్షేత్రస్థాయి పోలీసులకు సూచనలిస్తున్నామన్నారు. సైబర్‌మోసాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులను అల్లరిమూకలు ఇబ్బందులకు గురిచేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు.

ప్రభుత్వ ఆదేశాలు వస్తేనే ఠాణా ఏర్పాటు

ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన చౌడాపూర్ మండలానికి ప్రత్యేక ఠాణా ఏర్పాటుపై ప్రశ్నించగా.. ప్రభుత్వ నుంచి ఆదేశాలు వస్తే ప్రపోజల్స్ పంపిస్తామన్నారు. విలీన గ్రామాలు త్వరలోనే కుల్కచర్ల ఠాణా పరిధిలోకి వచ్చే అవకాశం ఉందున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర డ్రగ్స్ వ్యాపారికి రిమాండ్

మరో వ్యక్తి కోసం గాలింపు

ఇబ్రహీంపట్నం రూరల్: అంతర్రాష్ట్ర డ్రగ్స్ వ్యాపారిని ఆదిబట్ల పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఆదిబట్ల ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. రోమి భరత్ కల్యాణి (40) మహారాష్ట్రలో 10వ తరగతి వరకు చదువుకున్నాడు, థాయిలాండ్‌లో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. దుబాయ్‌లోని విశ్వవిద్యాలయంలో బీకాం గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. విదేశాల్లో చదువుకునే సమయంలో డ్రగ్స్‌కు బానిసైన రోమి భరత్ కల్యాణి డ్రగ్స్ వ్యాపారిగా మారాడు. చదువు పూర్తి చేసుకుని స్వదేశానికి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటుగా మాదకద్రవ్యాల వ్యాపారానికి దిగాడు. ఈ సమయంలో కేరళకు చెందిన టోబితో పరిచయం ఏర్పడింది. ఈ టోబి సహాయంతో కేరళ, బెంగళూరు నుంచి తక్కువ ధరకు గంజాయిని తీసుకువచ్చి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. 2004లో గంజాయి విక్రయిస్తున్నందుకు బాంద్రాలో, 2013లో ముంబైలోని ఖార్‌లో ప్రభుత్వ ఉద్యోగిపై దాడి కేసులో, 2023 ఉత్తర గోవాలోని గంజాయి కేసులో అంజునా పోలీసులకు పట్టుబడ్డాడు. జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత 2024లో గంజాయి విక్రయిస్తూ పంజాగుట్ట పోలీసులకు పట్టుబడ్డాడు. 2024 ఆగస్టు 8న బెయిల్‌పై బయటకు వచ్చిన అనంతరం రియల్ ఎస్టేట్ ముసుగులో గోవా, బెంగుళూర్, పూణేలకు వెళ్లాడు. రోమి అరెస్టుకు వారం ముందే టోబీ నుంచి ఓజీ ఖుష్ రకం గంజాయి, స్థానిక గంజాయి రెండింటిని కొనుగోలు చేసి బస్సులో హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. ఈ నెల 3న పక్కా సమాచారంతో బొంగ్లూర్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసులు రోమిని పట్టుకున్నారు. 1.5కేజీల గంజాయి, 50 గ్రాముల కొకైన్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు, డీసీపీ ఎస్‌ఓటీ మురళీధర్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రియుడితో కలిసి మరో ప్రియుడి హత్య



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీంకుమార్, ఎస్‌ఐ స్రవంతి, చిత్రంలో నిందితులు

- నలుగురు నిందితులకు రిమాండ్
- పరారీలో నిందితురాలు
- కేసు వివరాలు వెల్లడించిన సీఐ, ఎస్‌ఐ



మృతుడు శ్రీకాంత్(ఫైల్)

ధారూరు: ఓ వివాహిత ఇద్దరు ప్రియులతో నెరపిన వివాహేతర సంబంధం ఒకరి ప్రాణం తీసింది. ఈ ఘటన కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా చించోలీ తాలూకా కుంచావరం పీఎస్ పరిధిలోని జడి మల్కాపూర్ జలపాతం వద్ద చోటు చేసుకుంది. ధారూరు సీఐ భీంకుమార్, కోట్‌పల్లి ఎస్ స్రవంతి శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలు వెల్లడించారు. చేవెళ్ల మండలం కొంకుట్ల గ్రామానికి చెందిన అనితకు 15 ఏళ్ల క్రితం కోట్‌పల్లి మండలం అన్నాసాగర్‌కు చెందిన వ్యక్తితో వివాహమైంది. ఈమె వివాహేతర సంబంధం విషయం తెలుసుకున్న భర్త ఏడాది క్రితమే బలవన్మరణానికి పాల్పడ్డాడు. అన్నాసాగర్‌కు చెందిన శ్రీకాంత్(27), చౌట మల్లేశంతో ఒకరికి తెలియకుండా మరొకరితో అనిత వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఇటీవల విషయం తెలుసుకున్న శ్రీకాంత్ ఇద్దరినీ చంపేస్తానంటూ ఆమెను బెదిరించాడు. వివాహితుడైన శ్రీకాంత్‌ను వదిలించుకోవాలని భావించిన అనిత మనల్ని చంపేస్తానంటున్నాడని మల్లేశంకు చెప్పింది. దీంతో మల్లేశం తన మిత్రులైన జిన్నారం గ్రామానికి చెందిన మొల్ల బందెల్లి, బంటూ బందెల్లి, కోట్‌పల్లికి చెందిన అంజప్పతో కలిసి శ్రీకాంత్ హత్యకు పథకం వేశారు. సెప్టెంబర్ 25న శ్రీకాంత్‌ను అనిత, మల్లేశం అతని మిత్రులు లింగంపల్లి చౌరస్తాకు రప్పించారు. తమ కారులో అందరూ కలిసి జడి మల్కాపూర్ జలపాతానికి చేరుకున్నారు. శ్రీకాంత్‌కు ఫుల్‌గా మద్యం తాగించి మెడకు తాడు బిగించి హత్య చేశారు. అనంతరం శవాన్ని జలపాతంలో పడేసి వెళ్లిపోయారు. మృతుడి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు ఎస్ స్రవంతి దర్యాప్తు చేపట్టారు. కోట్‌పల్లి బందయ్య సమాచారం మేరకు అనుమానితులైన మల్లేశం అతని మిత్రులు మొల్ల బందెల్లి, బంటూ బందెల్లి, అంజప్పలను విచారించగా నేరం అంగీకరించారు. నిందితులను జలపాతం వద్దకు తీసుకెళ్లి శవం వెతికించినా వరద ప్రవహానికి లభ్యమవ్వలేదు. అనిత పరారీలో ఉండగా మిగిలిన నలుగురిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

కుటుంబ సర్వేలో తప్పలుండొద్దు



తాండూరు: సర్వేను పరిశీలిస్తున్న సబ్-కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్



దోమ: ఖమ్మంనాచారంలో అధికారుల సర్వే

తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

తాండూరు: డిజిటల్ కుటుంబ సర్వేను తప్పిదాలు లేకుండా చేపట్టాలని తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని మల్‌రెడ్డిపల్లి 1వ వార్డులో మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో డిజిటల్ కుటుంబ సర్వేను పైలెట్ ప్రాజెక్టు కింద మున్సిపల్ సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేను సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరును కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఎన్ని ఇళ్లు ఉన్నాయి? జనాభా ఎంత అనే వివరాలపై ఆరా తీశారు. 1వ వార్డులో మొత్తం 254 ఇళ్లు, 2,094 మంది జనాభా ఉన్నట్లు సబ్ కలెక్టర్ దృష్టికి మున్సిపల్ అధికారులు తీసుకొచ్చారు. ఈ నెల 8లోపు సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని సబ్ కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సర్వేలో మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, సిబ్బంది తదితరులున్నారు.

పారదర్శకంగా ఫ్యామిలీ సర్వే

దోమ: ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో ఖమ్మంనాచారం గ్రామం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ మహేశ్, తహసీల్దార్ పురుషోత్తం గ్రామంలో తిరుగుతూ కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి డిజిటల్ కార్డులో నమోదు చేశారు. ఈ ప్రక్రియలో మహిళ ఇంటి యజమానిగా ఉంటుందని, కుటుంబంలోని ప్రతి ఒక్కరి వివరాలు డిజిటల్ కార్డులో పొందుపరిచి ఉంటాయని గ్రామస్తులకు సూచించారు. ఇప్పటికే గ్రామంలో 110 ఇళ్లకు గాను 85 ఇళ్లకు సంబంధించిన పూర్తి స్థాయి సర్వేను పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సోమలింగం, పంచాయతీ కార్యదర్శి హాలిం, జమీల్, విజయ్‌కుమార్, వినోద్, రవి, జమీర్, శ్రీనివాస్, సీసీ అంజమ్మ, అంగన్వాడీ టీచర్ అనిత, ఆశ వర్కర్ శోభ, వీఓఏ అలివేలు, యాదయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మృత్యుఒడి వరకు సాగుపై మమకారం

ఆదర్శ రైతు రామచందర్ మృతి



రామచందర్ (ఫైల్)

సుభాష్‌నగర్: అక్కడ గజం స్థలం విలువ రూ.80 వేల నుంచి లక్ష వరకు పలుకుతుంది. చుట్టూ నూతన హంగులతో విల్లాలు, ఎత్తైన భవనాలు మధ్యలో ఆ రైతుకు తాతల నాటి నుంచి సంక్రమించిన 25 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. తన ఒంట్లో ఉన్న చివరి రక్తపుబొట్టు వరకు మట్టినే నమ్ముకుని వ్యవసాయం చేశాడు. తన నలుగురు కుమారులకు మెతుకు విలువ చెప్పి, వ్యవసాయం యొక్క గొప్పతనాన్ని నూరి పోశాడు. చివరికి వృద్ధాప్యంలోనూ సాగు చేస్తూ కన్నుమూశాడు. కుమారులు తండ్రి భౌతికకాయాన్ని తమ పొలం చుట్టూ వాహనంలో తిప్పి అంత్యక్రియలు నిర్వహించారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లికి చెందిన ఆదర్శ రైతు పెద్దనోల్ల రావిచెట్టుకింద రామచందర్(84) అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఆదర్శ రైతుగా ఎంపికై దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. మట్టిని అమ్ముకోకు, నమ్ముకొని జీవించు అనే సిద్ధాంతాన్ని రామచందర్ పదేపదే చెప్పుంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అతని అంత్యక్రియలకు గ్రామస్తులు రాజకీయ నాయకులు హాజరయ్యారు. ఆయనకు నలుగురు కుమారులు ఇద్దరు, కుమార్తెలు ఉన్నారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి

శంకర్‌పల్లి: చికిత్స పొందుతున్న రైతు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం శంకర్‌పల్లి పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని బుల్కాపూర్‌కు చెందిన రాములు(47) ఈ నెల 1న చిన్నశంకర్‌పల్లిలో ఉన్న తన పొలానికి బైక్‌పై వెళ్తున్నాడు. బైక్ అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యాడు. అయినప్పటికీ ఆస్పత్రికి వెళ్లకుండా నిర్లక్ష్యం వహించాడు. గురువారం రాత్రి గాయాలతో ఇబ్బంది పెరగడంతో కుటుంబ సభ్యులు నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైతు వేదికలో నాగుపాము

రైతు వేదికలో కనిపించిన నాగుపాము భయాందోళన సృష్టించింది. ఏఈఓ చెన్నయ్య తెలిపిన ప్రకారం.. విధుల్లో భాగంగా శుక్రవారం గ్రామంలోని రైతు వేదికకు వచ్చిన ఏఈఓ పనిలో నిమగ్నమయ్యారు. ఈ సమయంలో రికార్డు గదిలోనుంచి హాల్‌లోకి వచ్చిన నాగుపామును చూసి హడలిపోయాడు. పడగ విప్పిన పాము.. బుసలు కొడుతూ కొద్దిసేపు అక్కడే ఆగిపోయింది. ఈ విషయమై స్థానిక రైతులకు ఫోన్ చేసి చెప్పడంతో వారు వచ్చి పామును బయటకు వెళ్లగొట్టారు. – దోమ



దాదాపూర్ రైతు వేదికలో పడగ విప్పిన నాగుపాము

క్యాన్సర్ బాధితురాలికి ఆపరేషన్



చికిత్స పొందుతున్న వెంకటమ్మ

తాండూరు: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మహిళకు తాండూరులోని బాలాజీ నర్సింగ్ హోమ్ వైద్యులు శుక్రవారం విజయవంతంగా ఆపరేషన్ పూర్తిచేశారు. బొంరాస్‌పేట్ మండలం చౌదర్‌పల్లికి చెందిన వెంకటమ్మ కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు ఆమెను పలు ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకపోవడంతో రెండు రోజుల క్రితం బాలాజీ నర్సింగ్ హోమ్‌లో చేర్పించారు. పరీక్షించిన వైద్యుడు సంపత్‌కుమార్ అపెండిసైటిస్‌తో పాటు ఓరిన్ క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించారు. డాక్టర్ మహేందర్‌వర్మ, డాక్టర్ ఆశీష్, డాక్టర్ ఆగాత, వైద్య సిబ్బంది మహ్మద్ నూరి, గంగతో.. వెంకటమ్మకు శస్త్రచికిత్స చేయించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం కుదుటపడుతోందని వెల్లడించారు.

పారిశుద్ధ్య కార్మికుడి కూతురు నీట్‌లో మెరిసింది



హిందు

చేవెళ్ల: ఇటీవల విడుదలైన నీట్ పరీక్షల ఫలితాల్లో చేవెళ్లకు చెందిన పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు కందాడ సాయన్న కూతురు హిందు ఉత్తీర్ణత సాధించి కాళోజీ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ ఫ్రీ సీటు సాధించింది. ఈ విషయం తెలియడంతో శుక్రవారం ఆమెను, పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూ తన కూతురును ఉన్నత చదువులు చదివించిన సాయన్నను గ్రామ నాయకులు అభినందించారు. విషయం తెలిసిన బీజేపీ యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి తన వంతుగా రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేస్తానని ప్రకటించారు. పేద కుటుంబానికి చెందిన హిందు ఉన్నత చదువుకు ఎంపిక కావటం సంతోషకరమన్నారు. కందాడ సాయన్న సుజాత దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు వివాహం కాగా చిన్న కూతురు హిందూను గురుకుల పాఠశాలలో చేర్పించాడు. కుమారుడు ఇంజినీరింగ్ చదువుతున్నాడు. సుజాత ఓ ప్రైవేటు పాఠశాలలో ఆయాగా పనిచేస్తోంది. నిరుపేద కుటుంబం అయినప్పటికీ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. హిందు పదో తరగతి వరకు వికారాబాద్ ఎస్సీ గురుకుల పాఠశాలలో, ఇంటర్ నల్లకంచ గురుకుల కళాశాలలో చదివింది. కళాశాల నుంచి నీట్ పరీక్ష రాసిన ఆమె 466 మార్కులు సాధించింది. అర్హతను బట్టి ఎస్సీ కోటాలో వరంగల్‌లోని కాళోజీ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ ఫ్రీ సీటు సాధించింది. పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూ పిల్లలు బాగా చదువుకోవాలనే ఆలోచనతో ఉన్నత చదువులు చదించిన సాయన్నను పలువురు అభినందించారు. చదువుకు పేదరికం అడ్డు కాదని హిందు నిరూపించిందని కొనియాడారు.

సీతాఫలం భలే టేస్ట్



సీతాఫలాలు విక్రయిస్తున్న రైతులతో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు: ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే సీతాఫలాలను విక్రయిస్తున్న స్థానిక రైతులతో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సరదాగా మాట్లాడారు. శుక్రవారం ఆయన తాండూరు పర్యటనకు వస్తున్న క్రమంలో మన్‌సన్‌పల్లి వద్ద రోడ్డు పక్కన విక్రయిస్తున్న సీతాఫలాలను చూసి కారు ఆపారు. అనంతరం పండ్ల విక్రయించే చిరు వ్యాపారులతో ముచ్చటించారు. సీతాఫలాల ఎక్కడినుంచి సేకరిస్తున్నారని అడిగారు. పక్కనే ఉన్న అడవిలో నుంచి పండ్లను సేకరిస్తామని.. రెండు మూడు రోజుల పాటు నిల్వ ఉంచిన తర్వాత విక్రయిస్తామని వారు తెలిపారు. రైతుల కుటుంబ పోషణ తదితర వివరాలపై ఆరా ఎంపీ తీశారు. ఈ క్రమంలో సీతాఫలాలను ఆయన రుచి చూసి చిన్ననాటి స్మృతులను మననం చేసుకున్నారు.